ఆంధ్రజ్యోతి


5

ANDHRAJYOTHY

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

ఆదివారం 2 మార్చి 2025



బీటెక్, బీపీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్, అనుబంధ బీపీఈడీ కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ అధికారులు శనివారం విడుదల చేశారు. బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, ఈఈఈ బ్రాంచ్‌లకు సంబంధించి 5వ సెమిస్టర్‌కు 284 మంది విద్యార్థులు హాజరుకాగా 213 మంది ఉత్తీర్ణులయ్యారు. సీఎస్ఈ, ఈసీఈ, మెకానిక్ బ్రాంచ్‌ల్లో 7వ సెమిస్టర్‌కు 193 మంది హాజరుకాగా 178 మంది పాసయ్యారు. 3వ సెమిస్టర్ బీపీఈడీలో 280కు 274 మంది, డీపీఈడీలో 46కు46 మంది ఉత్తీర్ణులయ్యారని వర్సిటీ అధికారులు తెలిపారు.



హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థినులు



శ్రీకాకుళంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 685 మంది విద్యార్థులు గైర్హాజరు

నరసన్నపేట/ గుజరాతీపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 75 కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం పరీక్షలకు సంబంధించి 21,127 మంది విద్యార్థులకుగానూ 20,442 మంది హాజరయ్యారు. 685 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ప్రగడ దుర్గారావు తెలిపారు. మొదటిరోజు ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ నమోదు కాలేదని వెల్లడించారు. నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్న నిబంధనతో విద్యార్థులు ఉరుకులు.. పరుగులతో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ట్రైబ్ విద్యార్థులు తల్లిదండ్రుల సహకారంతో పరీక్షా కేంద్రాలకు వచ్చారు. పరీక్షలు రాసేవరకూ విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు కేంద్రాల బయట నిరీక్షించారు. నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర పరీక్షా కేంద్రాలను స్క్వాడ్ పరిశీలించింది. పట్టణంలోని రెండు కళాశాలల్లో పాఠశాలలు నిర్వహించడంపై సీఐ శ్రీనివాసరావు మండిపడ్డారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని తెలిపారు.

ఎస్పీ పరిశీలన

శ్రీకాకుళం క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి పరికరాలను అనుమతించ వద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున విద్యార్థులను మినహా ఇతరులను అనుమతించరాదని స్పష్టం చేశారు.





శ్రీకాకుళంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు



వాహనదారులకు పువ్వు ఇచ్చి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అమల్లోకి ట్రాఫిక్ నిబంధనలు



- లైసెన్స్ లేకపోతే రూ.5వేలు జరిమానా
- హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోతే రూ.వెయ్యి
- ర్యాష్ డ్రైవింగ్, రేసింగ్ చేస్తే రూ.10వేలు
- రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే..
- మొదటిరోజు పూలిచ్చి అవగాహన కల్పించిన పోలీసులు

శ్రీకాకుళం క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మోటారు వాహన చట్టంలో కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చేశాయి. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం నుంచే మోటారు వాహన చట్టాలను మరింత కఠినంగా అమలు చేసేలా రవాణా, పోలీసుశాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. తొలిరోజు వాహనదారులకు పూలు ఇచ్చి.. చట్టాలపై అవగాహన కల్పించారు. ఇకపై వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతామంటే కుదరదు. హెల్మెట్ తప్పనిసరి. ఆపై అన్నిరకాల ధ్రువపత్రాలు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడంతోపాటు లైసెన్స్‌లనూ సైతం రద్దు చేయనున్నారు. 'ఈ-చలానా' ద్వారా అపరాధ రుసుం విధించనున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ప్రతి వాహనదారుడి వివరాలు అందులో ఉంటాయి. గతంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారు... చలానా కట్టనివారి వివరాలు ఇట్టే అందుబాటులోకి వస్తాయి. దానికి అనుగుణంగా జరిమానాలు విధిస్తారు. అలాగే ఈ-చలానాలు ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా ఎం-పరివార్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

- ప్రమాదాల నివారణే లక్ష్యంగా..

16 నుంచి 25 ఏళ్లలోపు యువకులు అతివేగంగా వాహనాలు (మిగతా 6వ పేజీలో..)



ఉచిత గ్యాస్‌కు.. సాంకేతిక చిక్కులు

- మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన నడిమింటి సరోజినికి భారత్ గ్యాస్ ఏజెన్సీ కనెక్షన్ ఉంది. తెలుపు రేషన్ కార్డుతోపాటు బ్యాంక్ లింకేజీ ఉన్నా.. కూటమి ప్రభుత్వం 'దీపం-2' పథకంలో భాగంగా ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్ ఆమెకు అందడం లేదు. గ్యాస్ రాయితీ డబ్బులు ఆమె బ్యాంకు ఖాతాలో జమకావడం లేదు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది.
- మెళియాపుట్టి మండలంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో సుమారు 10,500 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1500 కనెక్షన్ల ఖాతాదారులకు 'దీపం-2' పథకం కిందట ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ డబ్బులు జమకాలేదని అధికారులు గుర్తించారు. ఇంకా మరో 1,500 మంది వరకూ ఈ పథకం వర్తించలేదని సమాచారం. జిల్లాలోని ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి. అధికంగా సాంకేతిక కారణాల వల్లే సబ్సిడీ డబ్బులు జమ కాలేదని తెలుస్తోంది.

- ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్న వినియోగదారులు
- తొలివిడత సబ్సిడీకి సమీపిస్తున్న గడువు

మెళియాపుట్టి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు కొంతమందికి అందడం లేదు. సాంకేతిక సమస్యలే దీనికి కారణమని తెలుస్తోంది. గతేడాది నవంబరు 1న ఇచ్ఛాపురం నియోజకవర్గం ఈదుపురంలో సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్టు ప్రకటించారు. ముందుగా వినియోగదారులు సిలిండర్ ధర ఏజెన్సీలకు చెల్లించాలని, రెండు రోజుల్లో ఆ డబ్బులు మొత్తం సబ్సిడీ కింద వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు తొలివిడత కింద ఇప్పటివరకూ 70 శాతం మందికి మాత్రమే సిలిండర్ రాయితీ డబ్బులు వారి ఖాతాకు జమయ్యాయి. తొలి సిలిండర్ సరఫరాకు ఇంకా నెలరోజులు మాత్రమే గడువు ఉండడంతో సిలిండర్ సబ్సిడీ తమకు వర్తిస్తుందో లేదోనని మిగిలిన గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 6,71,803 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో తెలుపు కార్డుదారులు 6,35,471 మంది ఉన్నారు. వీరిలో ఉచిత గ్యాస్ పథకానికి 4,95,793 మందిని అర్హులుగా అధికారులు గుర్తించా రు. కాగా.. సాంకేతిక కారణాల వద్ద సుమారు లక్షమందికిపైగా ఈ పథకానికి దూరమవుతున్నారు. కొంతమంది లబ్ధిదారులకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. గత నవంబరు నాటికి కొందరికి ఈకేవైసీ పూర్తికాలేదు. అలాగే కుటుంబ సభ్యుల పేర్లు తప్పుగా నమోదు కావడం, బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, గ్యాస్ కనెక్షన్ ఒకరి పేరుమీద.. వినియోగించేవారు మరొకరు కావడం వంటి కారణాలతో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి దూరమవుతున్నట్టు తెలుస్తోంది. అలాగే కొంతమంది రేషన్‌కార్డు లేకపోయినా ఏదో ఒక చిరునా మాతో గ్యాస్ కనెక్షన్ పొందారు. మరికొంతమంది ఇతరుల చిరునామాతో కనెక్షన్లు పొందారు. ప్రస్తుతం అటువంటి వారికి సిలిండర్ల రాయితీ డబ్బులు జమకావడం లేదని తెలుస్తోంది. గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పరిష్కారం కావడం లేదని లబ్ధిదారులు పేర్కొంటు న్నారు. గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపో తోందని వాపోతున్నారు. కాగా.. సాంకేతిక సమస్యలు ఉంటే 1967 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో దీపం-2 పథకానికి దూర మవుతున్నామని మరికొంత మంది వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా కొత్తకార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభించలేదని ఆవేదన చెందుతున్నారు. సుమారు 40వేల మంది కొత్తకార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

సరి చేస్తున్నాం

ఉచిత గ్యాస్ సిలిండర్ సరఫరా కాని లబ్ధిదారులు గ్యాస్‌ఏజెన్సీకి వస్తే సాంకేతిక సమస్యలు సరి చేసి పంపిస్తున్నాం. రెండో విడత సబ్సిడీ రావాలంటే ఈ నెల 20లోగా ఈకేవైసీ చేయించు కోవాలి. అధికంగా ఆధార్, బ్యాంకు ఖాతాలు అనుసంధానం కాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

- దుక్క మధు, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు, మెళియాపుట్టి

గ్యాస్‌కు అదనపు వసూళ్లపై కలెక్టర్ ఆగ్రహం

- ఏజెన్సీ రద్దు చేయాలని డీఎస్‌వోకు ఆదేశం

పొందూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పొందూరులోని ఓ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది.. వినియోగదారుల నుంచి సిలిండర్ బిల్లు ధర కన్నా అదనంగా వసూలు చేయడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పొందూరులోని మూగోడువీధిలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఆ సమయంలో పలువురు మహిళలు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది అదనపు వసూళ్లు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సిలిండర్ ధర రూ.829 ఉండగా.. రూ.870 నుంచి రూ.880 వసూలు చేస్తున్నారని తెలిపారు. వారి ఫోన్‌లో గ్యాస్ ధర బిల్లు మెసేజ్‌లు కూడా చూపించారు. వాటిని కలెక్టర్ పరిశీలించి.. అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న గ్యాస్ ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేయాలని డీఎస్‌వోకు ఫోన్‌లో ఆదేశించారు. ఈ విషయమై పూర్తి విచారణ చేసి నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు.



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


కూరుకుపోయిన లారీ

- కిలోమీటర్లు మేర ట్రాఫిక్‌జామ్
- ఆరు గంటలపాటు ప్రయాణికులకు అవస్థలు



లారీని బయటకు తీస్తున్న దృశ్యం

జి.సిగడాం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రహదారిపై ఓ లారీ కూరుకుపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం - రాజాం ప్రధాన రహదారికి సంబంధించి దవళపేట కూడలి వద్ద కల్వర్టు మరమ్మతులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువైపులా వచ్చే వాహనాలు మళ్లించేందుకు బీటీ రహదారి దిగువ నుంచి మరో మార్గం ఏర్పాటు చేశారు. కాగా ఈ రహదారిలో శనివారం తెల్లవారు జామున లారీ కూరుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు వీలులేకుండా కిలోమీటర్లు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి కనిపించింది. ఇటు పాలఖండ్యాం, అటు పొందూరు వరకు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోగా.. సుమారు 6 గంటలపాటు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్అండ్‌బీ జీఈ పీటీ రాజు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్ఐ వై.మధుసూదనరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కూరుకుపోయిన లారీని బయటకు తీయించారు. వాహనాలను మళ్లించి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



రహదారిపై నిలిచిన వాహనాలు



వాహనాలను పక్కకు మళ్లిస్తున్న దృశ్యం

గేటు పడితే అంతే!

- రైల్వే ఫ్లై ఓవర్ పనుల్లో తీవ్ర జాప్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

8లో



కొనసాగుతున్న ఫ్లై ఓవర్ ఎర్త్ వర్క్

బోడో దేవత ఉత్సవాలకు వేళాయే

- నేటి నుంచి ఐదు రోజులపాటు నిర్వహణ
- తరలిరానున్న భక్తులు

6లో

ప్రశాంతంగా..

● ఇంటర్ పరీక్షలు ప్రారంభం

జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు చాలా వరకు ముందుగానే చేరుకున్నారు. కొందరు ఆలస్యంగా రావడంతో పరుగులు తీయడం కనిపించింది. మొదట ఆలయాలకు వెళ్లి పూజలు చేసిన అనంతరం తల్లిదండ్రులతో కలసి కేంద్రాలకు చేరుకున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు సరైన రవాణా సౌకర్యాలు లేక అవస్థలు పడ్డారు. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో పరిమితికి మించి...ప్రమాదకర స్థితిలో ప్రయాణం చేయవలసి వచ్చింది.

-ఆంధ్రజ్యోతి బృందం


నందిగాం: పరీక్ష కేంద్రానికి ఆటోల్లో వస్తున్న విద్యార్థినులు


శ్రీకాకుళంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


హిరమండలం: పరీక్ష కేంద్రంలో విద్యార్థులు


శ్రీకాకుళంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



కంచిలి/జి.సిగడాం: పరీక్ష గది నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు


టెక్కలి పరీక్ష కేంద్రం వద్ద..

అమల్లోకి ట్రాఫిక్ నిబంధనలు

(ఐదో పేజీ తరువాయి)

నడుపుతూ.. రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లాలోని 2023లో 297 మంది, 2024లో 282 మంది చనిపోయారు. వీరిలో 16 నుంచి 25 ఏళ్లలోపు వారే 150 మందికిపైగా ఉన్నారు. అలాగే 2023లో రోడ్డు ప్రమాదాల్లో 766 మంది, 2024లో 918 మంది గాయాల పాలయ్యారు. వీరిలో 75శాతం మంది యువకులే ఉన్నారు. వాహన చట్టాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ఫలితం లేకపోతోంది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే యువతకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నా మార్పురావడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

వాహనదారుల్లో మార్పు తీసు కొచ్చి, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకే మోటారు వాహన చట్టాలను కఠినంగా అమలు చేస్తున్నాం. ఎస్పీ సూచనల మేరకు శనివారం శ్రీకాకుళంలోని ప్రతి కూడలిలోని వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించాం. పువ్వులు ఇచ్చి నిబంధనలు పాటించాలని సూచించాం. మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మంది లైసెన్స్‌లు రద్దు చేశాం.

- నాగరాజు, ట్రాఫిక్ సీఐ, శ్రీకాకుళం

జరిమానాలు ఇలా..

ఉల్లంఘన	పాత జరిమానా	కొత్త జరిమానా
లైసెన్స్ లేనివారికి వాహనం ఇస్తే	1000	5000
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే	500	5000
మైనర్లు వాహనాలు నడిపితే	500	10000
అతివేగంగా వాహనం నడిపితే		
(చిన్న వాహనాలకు)	400	1000
(పెద్ద వాహనాలకు)	500	2000
ప్రమాదకరంగా వాహనం నడిపితే		
(మొదటిసారి పట్టుబడితే)	1000	2000
(రెండోసారి పట్టుబడితే)	–	10000
రిజిస్ట్రేషన్, ఫిట్నెస్ లేని వాహనాలు నడిపితే		
(మొదటిసారి పట్టుబడితే)	2000	5000
(రెండోసారి పట్టుబడితే)	4000	8000
వాహనాలతో రేసింగ్ చేస్తే		
(మొదటి సారి పట్టుబడితే)	1000	5000
(రెండోసారి పట్టుబడితే)	–	10000
సీటు బెల్ట్ పెట్టుకోకుంటే	100	1000
హెల్మెట్ ధరించకపోతే	100	1000
సైలెన్సర్లు మార్చి పెద్ద శబ్దాలు చేస్తే		
(మొదటిసారి పట్టుబడితే)	500	1000
(రెండోసారి పట్టుబడితే)	–	2000
ఇన్సూరెన్స్ లేని వాహనాలు నడిపితే		
(మొదటిసారి పట్టుబడితే)	100	2000
(రెండోసారి పట్టుబడితే)	–	4000

బోడో దేవత ఉత్సవాలకు వేళాయె

● నేటి నుంచి ప్రారంభం ● ఐదు రోజుల పాటు నిర్వహణ
● తరలిరానున్న భక్తజనం ● ఏర్పాట్లు పూర్తి


నూతనంగా నిర్మించిన బోడో దేవత ఆలయం

కంచిలి, మార్చి 1: బెంతు ఒరియాల ఆరాధ్య దైవం బోడో దేవత ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. పెద్ద ఆముదాలపుట్టుగలోని బోడో అమ్మవారి ఆలయం వద్ద ఐదు రోజుల పాటు వైభవంగా ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి పెద్దఆముదాలపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, నాథపుట్టుగ, చిన్న ఆముదాలపుట్టుగ గ్రామస్థులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు 18 పుట్టుగ గ్రామాలకు చెందిన భక్తులతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.


పూజలందుకుంటున్న బోడో అమ్మవారు (ఫైల్)

70 ఏళ్ల నుంచి..

సుమారు 70 ఏళ్ల నుంచి బోడో దేవత ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా మహా శివరాత్రి తరువాత వచ్చే మొదటి గురువారం బోడో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయంలో ఉన్న మట్టి పుట్టనే అమ్మవారిగా కొలుస్తారు. అమ్మవారికి భక్తులు పాయసం, నెయ్యిలు, కోడిగుడ్లను నైవేద్యంగా పెడతారు. భక్తులు సమర్పించే నైవేద్యాల్లో స్వయంపాకం ప్రత్యేకమైనది. బియ్యంలో సోలడు కందిపప్పు, బెల్లం కలిపి మట్టి కలశంలో గుడి ప్రాంగణంలోనే వండుతారు. ఈ ప్రసాదాన్ని భక్తితో అమ్మవారికి సమర్పిస్తారు. మొదటి నాలుగు రోజులపాటు అమ్మవారికి వివిధ పూజలు నిర్వహిస్తారు. ఐదో రోజు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పిస్తారు. 70 సంవత్సరాలపాటు పెద్ద ఆముదాలపుట్టుగలోని పురాతన మందిరంలోనే అమ్మవారు పూజలు అందుకున్నారు. ఈ ఏడాది నూతన ఆలయాన్ని నిర్మించి అమ్మవారి ప్రతిష్ఠా కార్యక్రమాలను సైతం చేపడుతున్నారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లిన బెంతు ఒరియా కులస్థులంతా ఈ ఉత్సవాల కోసం తప్పకుండా స్వగ్రామాలకు చేరు కుంటారు. ఈ ఉత్సవాలనే జామి జాతరగా స్థానికంగా పిలుస్తారు. ఇక్కడ జాతర జరిగిన తరువాత మృగశిరా నక్షత్రం సమయంలో సోంపేటలో జామి జాతర జరుగుతుంది. అనంతరం మండలంలోని జాడుపుడి, మజ్జిపుట్టుగ, కవిటి, పలాస గ్రామాల్లో జామి ఎల్లమ్మ జాతర్లు జరుగుతాయి.

వందలాది కుటుంబాలకు ఉపాధి

ప్రతి ఏటా నిర్వహించే బోడో దేవత ఉత్సవాల సందర్భంగా వందలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు ఇక్కడ దుకాణాలను ఏర్పాటు చేస్తారు. పిన్నీసు నుంచి ఎలక్ట్రిక్ బొమ్మలు, నిత్యావసరాల వస్తువులు, గృహోపకరణాలు, చేనేత వస్తువులు, మట్టి కుండలు, ఇతర సామగ్రి అమ్మే వందలాది దుకాణాలు తెరుచుకుంటాయి. వీటి వల్ల చాలా మందికి ఉపాధి లభిస్తుంది. అలాగే, ఉత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఒరియా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తుంటారు. ఒడిశా రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారులు తమ ప్రదర్శనలు ఇస్తుంటారు. వీటిని చూసేందుకు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి


సైకిల్ తొక్కుతూ పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం కేశవరావు

హిరమండలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రోజూ సైకిల్ తొక్కితే ఆరోగ్యంగా ఉండటంతో పాటు పర్యావరణాన్ని కాపాడినవారవుతారని హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తూలుగ కేశవరావు అన్నారు. సైకిల్‌పై ప్రయాణం చేయడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తూ శనివారం పాతపట్నం నుంచి హిరమండలం వరకు 20 కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కుతూ పాఠశాలకు వచ్చారు. అలాగే వెళ్లేటప్పుడు కూడా హిరమండలం నుంచి పాతపట్నం సైకిల్ మీదే ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సైకిల్ ఉపయోగించాలని దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాత్రమే ద్విచక్ర వాహనాలను ఉపాయోగించాలన్నారు. దీనివలన డబ్బులు ఆదా, పర్యావరణ రక్షణతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి

పలాస రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు తమ సంస్కృతి, తమ భాషని మరచిపోతున్నారని, వాటిని కాపాడుకోవాలని గిడుగు రామమూర్తి కళాపీఠం వ్యవస్థాపకుడు, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు అన్నారు. పలాస మండలం రంగోయి గ్రామం గిడుగు రామమూర్తి కళాపీఠం వ్యవస్థాపకుడు, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు శనివారం విశాఖలోని ఆకాశవాణి కేంద్రంలో 'గిరిజన తెగలు-సంస్కృతి' అనే అంశంపై మాట్లాడారు. ఉత్తరాంధ్రలో సవర, జాతపు, గదబ, కొండదొర, మన్నెందొర, కొండరెడ్లు, భగతవాల్మీకీ, నూకదొర, ఖొందు, కోటియా, ఎరుకుల, బొండొ వంటి సుమారు 20 ఆదివాసీ తెగల ఆచారాలు, సంప్రదాయలు వివరిస్తూ ప్రసంగించారు. అంతరించిపోతున్న ఆదివాసీల సంస్కృతిని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో తిరుపతిలో దక్షిణ భారత జానపద విజ్ఞాన సదస్సులో ఉత్తరాంధ్ర జానపద కళలు, సాహిత్యంపై పత్ర సమర్పణ చేయనున్నట్లు కూర్మారావు తెలిపారు.



విశాఖ ఆకాశవాణి కేంద్రంలో మాట్లాడుతున్న బద్రి కూర్మారావు

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్

● ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
● ఈ నెల 31 వరకు గడువు
● ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష

ఇచ్ఛాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ప్రతి పాఠశాలలో 100 సీట్లను భర్తీ చేయనున్నారు. 5వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి. ఐదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. ఆధార్ కార్డు జిరాక్స్‌ను జతపరచాల్సి ఉంటుంది. సొంత మండలాల వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఏప్రిల్ 20న ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

ఇంగ్లీష్ మీడియం బోధన..

జిల్లాలో పొందూరు, రణస్థలం, కుప్పిలి, లావేరు, జి.సిగడాం, పోలాకి, జలుమూరు, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం, కంచిలి, ఓపీపేట (బూర్జ)లో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో ఇక్కడ బోధన అందిస్తారు. నైతిక విలువలు, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ విషయంలో ప్రత్యేక బోధన ఉంటుంది.


పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల

అన్ని సదుపాయాలతో ఫిజిక్స్ కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్ ఉంటుంది. గ్రంథాలయం సైతం అందుబాటులో ఉంటుంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్ అందిస్తారు. కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఈ-లెర్నింగ్ సీసీఈకు అనుగుణంగా విద్యాబోధన ఉంటుంది. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థుల కోసం ఆరో తరగతిలో బ్రిడ్జికోర్సు కూడా అందిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆదర్శ పాఠశాలల్లో అడ్మిషన్లకు విపరీతమైన పోటీ ఉంది. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉంది.

అర్హులకే అడ్మిషన్లు

జిల్లా వ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 20న పరీక్ష నిర్వహిస్తాం. అందులో అర్హత పొందిన వారికి అడ్మిషన్లు ఇస్తాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

-తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖ అధికారి, శ్రీకాకుళం

శ్రమిస్తేనే ఉత్తమ ఫలితాలు: ఏఎస్పీ

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రమిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఏఎస్పీ కె.వెంకటరమణ అన్నారు. 2024-25 సీజన్‌లో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు సత్కరించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ఏసీఏ విభాగం జీఎమ్ ఎంఎస్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా నుంచి ఎందరో యువ క్రీడాకారులు రాణిస్తున్నారని, జిల్లా నుంచి స్టార్ ఆల్‌రౌండర్ తిపురాన విజయ్ ఐపీఎల్‌లో ఎంట్రీ లభించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్ వండాన మురళీమోహన్, శివానీ యాజమాన్యం దుప్పల వెంకటరావు జిల్లా క్రికెట్ సంఘం కోశాధికారి మదీనా శైలాని, ఇలియాస్ మహ్మద్, డాక్టర్ సువ్వారి రవికుమార్, జి.పురుషోత్తమనాయుడు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచూపిన క్రీడాకారులు వీరే..

వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారిలో త్రిపురాన విజయ్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్, ఎస్.హిమకర్, ఆర్.జున్నారావు, నంబాళ్ల సుశాంత్, ఎం.పూర్ణచంద్ర, ఎస్.సాత్విక్, సీహెచ్ యోజిత్, జేగేంద్ర, వివేకానందా, ఎస్.కిరణ్, ఎస్వీ ప్రేరణ్, కె.హిమచంద్ర, ప్రణీత్‌లను ఘనంగా సత్కరించారు.


రాష్ట్ర క్రికెటర్లను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగులను గుర్తించండి: కలెక్టర్

పొందూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి):వర్క్‌ఫ్రమ్ హోంపై ఆసక్తి చూపే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. శనివారం పొందూరు వర్క్‌ఫ్రమ్‌హోం గుర్తింపు సర్వేను కలెక్టర్ పరిశీలించారు. మండలంలో ఇప్పటివరకు 403 మందిని గుర్తించినట్లు ఎంపీడీవో మన్మథరావు తెలిపారు. కాగా పొందూరులో నిర్మాణంలో ఉన్న రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. కేంద్రప్రభుత్వ నిధులతో రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతాలోపాలకు అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రోడ్ల నిర్మాణాల వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై పీఆర్ డీఈ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు.

వేట సాగనీయడం లేదని మత్స్యకారుల నిరసన



కవిటి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

కవిటి, మార్చి1(ఆంధ్రజ్యోతి): తమను వేటసాగనీయకుండా అడ్డుకుంటుండడంతో న్యాయం చేయాలని పెద్దకర్రివానిపాలెం గ్రామ మత్స్యకారులకు కవిటి తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకారులు చంద్రశేఖర్, కె.గోపయ్య, కె.యువరాజులు తదితరులు మాట్లాడుతూ ఇద్దివానిపాలెంవద్ద ఉన్న కాలువద్వారా సముద్రంలోకివెళ్లి వేట సాగిస్తున్నామని, కొద్దిరోజులుగా ఆగ్రామస్థులు ఈప్రాంతం నుంచి వెళ్లవద్దని అడ్డుపడుతున్నారని తెలిపారు. నిరసన తెలుపుతున్న మత్స్యకారుల వద్దకు తహసీల్దార్ మురళీమోహనరావు వచ్చి సమస్య అడిగితెలుసుకొన్నారు. వెంటనే ఎస్‌ఐ రవివర్మ, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిలతో మాట్లాడారు.గ్రామానికి వెళ్లి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు.

ఏపీ బీఏ ఈసీ సభ్యుడిగా అశోక్‌కుమార్

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి1(ఆంధ్రజ్యోతి):ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యుడిగా మెట్ట అశోక్‌కుమార్‌ను నియమించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో కార్యదర్శిగా కొనసాగుతున్న అశోక్‌ను ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో ఈసీ సభ్యుడిగా నియమించినట్లు రాష్ట్రకార్యదర్శి అంకమ్మ చౌదరి నుంచి ఉత్తర్వులు అందాయి.

బీజేపీ బూత్ అధ్యక్షుల నియామకం

గుజరాతీపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని వెస్ట్ మండలం బీజేపీ అధ్యక్షుడు చింతాడ భూషణరావు ఆధ్వర్యంలో బూత్‌ల అధ్యక్షులను శనివారం నియమించారు. ఈసందర్భంగా శక్తికేంద్రాల విభజన, ఇన్‌చార్జిలు, మండల కమిటీల బాధ్యతలపై చర్చించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర పదాధికారి పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు గాంధీ పాల్గొన్నారు.

బీసీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కన్నంనాయుడు

బూర్జ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిల్లా కన్నంనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు అమరావతిలోగల కార్యాలయంలో మహిళా అధ్యక్షురాలు యలగాల నూకానమ్మ శనివారం నియామకపత్రం అందజేశారు.

గురుమహారాజ్ ప్రబోధాలు మానవాళికి ఆదర్శం

ఆమదాలవలస, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామకృష్ణ పరమహంస (గురుమహారాజ్) ప్రబోధాలు విశ్వమానవాళికి ఆదర్శమని శ్రీరామకృష్ణ సేవాసమితి సమన్వయకర్త మండపల్లి రామకృష్ణారావు తెలిపారు. శనివారం పట్టణంలోని రామకృష్ణ మందిరంలో పరమహంస జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో అంపోలు రామాచార్యులు, భరత్‌కుమార్, రాజేశ్వరి, పి.సోమేశ్వరి పాల్గొన్నారు.

●సోంపేట, మార్చి1(ఆంధ్రజ్యోతి):సోంపేటలోని శ్రీశయన వీధిలో గల రామకృష్ణమందిరంలో రామకృష్ణ పరమహంస జయంతిని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా పూజలు, భగవద్గీత పారాయణం, భక్తిగీతాల ఆలాపన, ఆధ్యాత్మికకార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గరుడాచలం శంకర్‌రావు, ఎం అప్పారావు, నారాయణ, హరికృష్ణ, చంద్రశేఖర్, మలిపెద్దవేణు, కె వేణు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

అరసవల్లి, మార్చి1(ఆంధ్రజ్యోతి):స్థానిక పాత శ్రీకాకుళం హరిజనవీధి కమిటీ హాల్‌లో ఎస్సీ వర్గీకరణ పోరాటం చేసి అమరులైన వారికి అమరవీరుల దినం పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు దాసరితిరుమలరావు మాదిగ, లోపింటి తేజేశ్వరరావు మాదిగ, బోసు మన్మథరావు, లోపింటి కృష్ణ పాల్గొన్నారు.

తెలుగులో ఉత్తర్వులు వెలువరించాలి

గుజరాతీపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. పది కోట్లు బడ్జెట్‌లో కేటాయించడంపై రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర నాయకులు పట్నాన వెంకటరమణ, పూడి లక్ష్మీపతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. అధికార భాష అమలుకోసం ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, ప్రభుత్వం వెలువరించే ఉత్తర్వులను తెలుగులో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఆమదాలవలస, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆమదాలవలస రూరల్, అర్బన్, సరుబుజ్జిలి, బూర్జ మండలాల ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సనపల డిల్లీశ్వరరావు, నూకరాజు, అంబళ్ల రాంబాబు, వావిలపల్లి రాంజీ, మురళి పాల్గొన్నారు.

కుదిరాంలో పశువులకు టీకాలు

ఆమదాలవలస, మార్చి 1(ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని 21వవార్డు కుదిరాంలో శనివారం పశువులకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశు సహాయ సంచాలకులు డాక్టర్ రేణంకి ఆనందరావు మాట్లాడుతూ గాలికుంటువ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు పాడి పశువులకు వేస్తున్నట్లు తెలిపారు.

తరగతులను విలీనం చేయవద్దు



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సిర్తలి గ్రామస్థులు

కంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లూరు పంచాయతీ పరిధిలోని సిర్తలిలోగల ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులను ఎంఎస్‌పల్లి పాఠశాలలో విలీనం చేయవద్దని సిర్తలి గ్రామస్థులు డిమాండ్‌చేశారు. ఈమేరకు శనివారం కంచిలి మండల వనరుల కేంద్రంలో ఎంఈవో శివరాంప్రసాద్, చిట్టిబాబులకు మాజీ సైనికోద్యోగి పైల రామారావు, ఎస్ఎంసీ చైర్మన్ పైల దాలయ్య రెడ్డి, పైల లక్ష్మీనారాయణ, పైల మాధయ్య, మద్ది డిల్లీరావు వినతిపత్రం అందజేశారు.

బాతువలో అన్నసమారాధన

జి.సిగడాం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బాతువ శివాలయంలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదువేల మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

స్వచ్ఛ శ్రీకాకుళమే లక్ష్యం

అరసవల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ తెలిపారు. శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల వద్ద రోడ్లను పరిశుభ్రంగా ఉంచే ఆధునిక టెక్నాలజీతో కూడిన వాహనాన్ని ప్రారంభించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న శ్రీరాంపురానికి చెందిన మార్పు కమల అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.25వేలు చెక్కును టీడీపీమండల కార్యదర్శి మాదిన రామారావు శని వారం అందజేశారు. కార్యక్రమంలో సత్య నారాయణ, సతీష్‌ప్రదీప్ పాల్గొన్నారు.

మరమ్మతులు లేక.. శిథిలావస్థకు చేరి



పెచ్చులూడిన శ్లాబు

● శ్లాబు పెచ్చులూడుతుండడంతో ఆందోళన చెందుతున్న సిబ్బంది ● ఇదీ పొందూరు సీహెచ్‌సీలో పరిస్థితి

పొందూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి):పొందూరు సీహెచ్‌సీకి మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనానికి కనీస స్థాయిలో నిర్వహించని పరిస్థితి నెలకొంది. దీంతో తరచూ శ్లాబు పెచ్చులూడుతోంది. తాజాగా శనివారం వైద్యురాలి సుజాత గదిలో శ్లాబుపెచ్చులూడాయి. ఆ సమయంలో ఆమె బయటకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. దాదాపు అన్ని గదులూ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు శ్లాబుపెచ్చులూడుతాయోనని వార్డులో చీకటిపడిన తర్వాత ఉండడానికి రోగులు, వారి బంధువులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడకు నాలుగు మండలాల నుంచి ప్రతిరోజూ 150 మంది వరకు వైద్యసేవలకు వస్తుంటారు. ఏడుగురు డాక్టర్లు, 30 మంది వరకూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గదులు బీటలు వారి శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఆసుపత్రి పక్కనే నూతన ఆసుపత్రి నిర్మాణం జరిగినా ప్రారంభానికి నోచుకోవడంలేదు.

డీపీటీసీలో వసతులపై నివేదిక ఇవ్వండి: ఎస్పీ



డీపీటీసీలో భోజన తయారీ గదులను పరిశీలించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్,మార్చి1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శిక్షణకేంద్రం(డీపీటీసీ)లో వసతులపై నివేదిక ఇవ్వాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు.శనివారం మండలంలోని తండేవలసలోగల డీపీటీసీని పరిశీలించారు. త్వరలో పోలీసు శిక్షణ పొందేందుకు వచ్చే కానిస్టేబుళ్లకు కల్పించే మౌలిక సదుపాయాలను అధికారులను అడిగితెలుసుకున్నారు.ఆయన వెంట ఏఎస్పీ రమణ,సీఐ కృష్ణమూర్తి, ఆర్ఐ నర్సింగరావు, పోలీస్ హౌసింగ్ ఏఈ తరుణ్,ఎస్ఐ రవికుమార్ ఉన్నారు.

సైబర్ నేరాలపై దృష్టి సారించండి

శ్రీకాకుళంక్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి):ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసే వారిపై, సైబర్‌నేరాలపై దృష్టి సారించాలని ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు త్వరగా న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతీ పోలీసుస్టేషన్ పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఇటీవల దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు, ప్రాపర్టీ నేరాలను ఛేధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించి ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులు,సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, వీవీ అప్పారావు, ఏవో సీహెచ్ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఫోకస్ క్రికెట్ లీగ్‌లో ఇచ్ఛాపురం ఐసీసీ క్లబ్ విజయం

ఎచ్చెర్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చిలకపాలెంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఫోకస్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో ఇచ్ఛాపురం ఐసీసీ క్రికెట్ క్లబ్ జట్టు గెలుపొందింది. క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు జీపీనాయుడు, కొట్టిస కిరణ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన లీగ్‌మ్యాచ్‌లో తొలిరోజు ఇచ్ఛాపురం ఐసీసీ క్రికెట్ క్లబ్, పలాస జేబీసీ టీమ్‌లు పోటీపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసి ఇచ్ఛాపురం జట్టు 35 ఓవర్లకు 243 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన పలాస జట్టు 93 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇచ్ఛాపురం జట్టులో 68 పరుగులు చేసిన ఆర్యా విక్రమ్‌కు మ్యాన్ ఆఫ్ మ్యాచ్ అవార్డు లభించింది. కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మేనేజర్ ఎంఎస్ కుమార్, జిల్లాక్రికెట్ సంఘం చీఫ్ మేనేజర్ ఇలియాజ్ అహమ్మద్, దుప్పల వెంకటరావు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంచాలి: పీడీ

గార, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఫారం పాండ్స్ పనులు పూర్తి స్థాయిలో చేసి, భూగర్భ జలాలు పెంచాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు కోరారు. శనివారం రామచంద్రపురంలో ఫారం పాండ్స్ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో సంధ్యారాణి, సిబ్బంది ఉన్నారు.

అదనపు వసూళ్లపై విచారణ

పొందూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పొందూరులో ఓ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలపై డీఎస్‌వో జి. సూర్యప్రకాశ్ శనివారం విచారణ చేపట్టారు. ఇక్కడి మూగోడువీధిలో పలువురు మహిళలు గ్యాస్ డెలివరీ సిబ్బంది బిల్లు కంటె రూ.14 నుంచి 51 అదనపు వసూళ్లు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో విచారణ జరిపి నివేదిక అందించాలని కలెక్టర్ డీఎస్‌వోను ఆదేశించగా రెవెన్యూ అధికారులతో కలిసి విచారణ జరిపి అదనపు వసూళ్లు వాస్తవమని తేల్చారు. తహసీల్దార్ కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ ఆర్. వెంకటేష్, డీఎస్‌వో తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు: కమిషనర్



తోటపాలెంలో పర్యటిస్తున్న ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పీవీవీ ప్రసాదరావు కోరారు. శనివారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో గల తోటపాలెంలో పర్యటించి మంచినీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం అధికారులతో చర్చించారు. ఆయన వెంట హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, మునిసిపల్ ఇంజనీర్ సుధాకర్ ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పరిశీలనలో భగాంగా పలు దుకాణాలను పరిశీలించారు. పలు దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సామగ్రిని గుర్తించి సీజ్ చేశారు.

'నాడు-నేడు'పై ఉన్నతాధికారులకు నివేదిక

పొందూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పొందూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో నాడు-నేడు పనులపై నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఏపీ ఈడబ్ల్యూఐడీసీ డీఈ కె.రాములు, ఏఈ సాయికిరణ్ తెలిపారు.శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనుల రికార్డులు,తీర్మానాలను, బ్యాంకు చెక్ జిరాక్సులను హెచ్‌ఎం వెంకటరావు సమక్షంలో పరిశీలించారు.ఇక్కడ జరిగిన పనుల్లో అవినీతి, తనకు రావాల్సిన బిల్లుల బకాయిలపై గత పీఎంసీ చైర్మన్, పనులను చేపట్టిన జి.హేమలత ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు విచారణజరిపారు. రికార్డుల్లో లోపాలను, హేమలత సంతకాలలో తేడాలను,గతంలో పీఎంసీసభ్యుడు తన కుమార్తె పాఠశాలనుంచి వెళ్లిపోయినా సభ్యుడిగా కొనసాగించి చెక్కులపై సంతకాలు చేయించినట్లు గుర్తించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు

సరుబుజ్జిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొట్టవలస, కేజీపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మెమోలు ఇచ్చినట్లు బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో గీత తెలిపారు. శనివారం సరుబుజ్జిలిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేజేపేట అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై వచ్చిన ఆరోపణలు విచారించగా ఆమె నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మెమో జారీ చేశామని తెలిపారు. రొట్టవలస అంగన్‌వాడీ కేంద్రం-2 విధులు నిర్వహిస్తున్న కార్యకర్త, సహాయకురాలు విధులకు గైర్హాజరుకావడంపై మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఇద్దరికి మెమోలు అందజేశామని చెప్పారు. వీటిపై స్పష్టమైన సమాధానాలు వారి నుంచి రాకపోతే జిల్లా అధికారులకు తదుపరి చర్యలు నిమిత్తం నివేదిస్తామని తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్ఎంపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.గణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు, 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి శనివారం నుంచి ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.దీనికి సంబంధించి ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

ప్రజలపై పన్నుల భారం

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు

అరసవల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో ప్రజలపై పన్నుల భారం తప్పదని, గత ప్రభుత్వం చేస్తున్న తప్పులే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రెవెన్యూ ద్రవ్యలోటును ఎలా పూడుస్తుందో చెప్పలేదని, ప్రజలపై ఇది పన్నుపోటు బడ్జెట్ తప్ప మరేమీ కాదని తెలిపారు.

●వేతనదారులకు రాష్ట్ర బడ్జెట్ నిరాశే మిగిల్చిందని, రాష్ట్ర ప్రభుత్వం వేతనజీవులను పూర్తిగా విస్మరించిందని సీఐటీయూజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కార్మికుల వేతనాలు కోసం, సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

● ఆమదాలవలస, మార్చి 1(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమం లేదని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. శనివారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ మొదటిసంవత్సరం సూపర్‌సిక్స్ పథకాలను అటకెక్కించారన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి: డీపీవో

కవిటి, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలని పంచాయతీ అధికారి కె.భారతీసౌజన్య ఆదేశించారు. శనివారం మండలంలోని రాజపురం, కవిటి, బెజ్జిపుట్టుగ పంచాయతీల్లో శనివారం పర్యటించారు.ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, సర్పంచ్‌లు పి.లక్ష్మణరావు, ఎస్‌పీ నారాయణస్వామి, ఈవో జి.వీరభద్రస్వామి ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కంచిలి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండాలని జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోరికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో తిరుమలరావు, ఏవో రమణమూర్తి ఉన్నారు.

● జి.సిగడాం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చెత్తసంపద కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ కోరారు. శనివారం నాగులవలస చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు పొట్నూరు సురేష్‌కుమార్, చైతన్యకుమారి ఉన్నారు.

నేడు పన్ను బకాయిల చెల్లింపునకు కౌంటర్లు

శ్రీకాకుళంఅర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తమ కార్యాలయంలో గృహ, వాణిజ్య సముదాయాల యజమానులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి,కొళాయి పన్ను బకాయిలు చెల్లించేందుకు ఆదివారంప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు.అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న అసిరితల్లి పండుగ


గార, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పూసర్లపాడులో అసిరితల్లి గ్రామదేవత పండుగ ఈనెల నాలుగో తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.


5న ఎంఎస్ఎంఈ రుణమేళా

శ్రీకాకుళం రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈనెల ఐదో తేదీన ఎంఎస్ఎంఈ రుణమేళా నిర్వహించనున్నట్లు యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్ తెలిపారు.స్థానిక వెంకటాపురంలోని ఆ బ్యాంకులో విలేకరులతో మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ రుణమేళాలో గృహ, రిటైల్, విద్య, గోల్డ్, వ్యవసాయ రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పి.రవి పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

రణస్థలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఆర్డీవో సాయిప్రత్యూష రెవెన్యూ సిబ్బందని ఆదేశించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. రెవెన్యూసదస్సులో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌ప్రసాద్, డీటీ నారాయణమూర్తి పాల్గొన్నారు.





గేటు పడితే అంతే..!

● రైల్వే ఫ్లై ఓవర్ పనుల్లో తీవ్ర జాప్యం
● ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

పాతపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ మార్గంలో నిత్యం ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తుం టాయి. ఆ సమయాల్లో పాతపట్నం వద్ద గేటు పడిందంటే ప్రయాణికులు నరకం చూడాల్సిందే. రైల్వే ట్రాక్‌పై హైవే పనుల్లో జాప్యంతో నిత్యం గంటల తరబడి వాహనాలు నిలిచి వాహన దారులు ఇక్కట్లకు గురవుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జమ్ము-మోహన 326ఎ జాతీయ రహదారి విస్తరణ పనులకు 2019లో రూ.42 కోట్లు నిధులు మంజూరు చేసింది. పను లను ప్రారంభించారు. అయితే పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపి స్తున్నాయి. గడచిన ఐదేళ్లలో పనులు నత్త నడకన సాగుతుండడంతో గేటు పడిందంటే ఎక్కువ సమయం ఇరు పక్కలా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవాల్సిన పరిస్థితి. ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్ స్లాబ్‌లలో నాలుగు పూర్తయ్యాయి. రైల్వే లైన్ పైనుంచి వేయాల్సిన స్లాబ్ పనులకు రైల్వే శాఖ అను మతులు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియలో ఇంకా పురోగతి కనిపించడం లేదు. ఈ వంతెన నిర్మాణానికి ఇరువైపులా వేయాల్సిన బీటీ సర్వీస్ రోడ్లు కూడా ఇంతవరకు రూపుదాల్చుకోలేదు. దీంతో ఇప్పటికే మట్టి రోడ్డుపై ఏమాత్రం నీరు పడినా వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడాల్సిందే. అలాగే ధూళి వల్ల శ్వాసకోస వ్యాధులు ప్రబలుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ ఫ్లై ఓవర్ పనులు ఈ ఏడాది జూలై నాటికి పూర్తి కావాల్సి ఉన్నా పనుల్లో జాప్యం వల్ల ఈ గడువు లోగా పనుల పూర్తవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


నిత్యం రైల్వేగేటు వద్ద వేచి కనిపించే దృశ్యం ఇది..

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు..

పాతపట్నంలోని శ్రీనీలమణి దుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు నిత్యం ఆంధ్ర, ఒడిశా ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తుంటారు. అయితే ఈ వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నారు. అలాగే ఇటు శ్రీకాకుళం నుంచి టెక్కలి-హిరమండలం నుంచి రొంపివలస- రొమదళ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పాతపట్నానికి ఈ వంతెన మీద నుంచి ప్రయా ణించాల్సిందే. విద్యా కేంద్రంగా పేరొందిన పాతపట్నంతో పాటు అటు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి చేరాలన్నా ఈ మార్గంలోనే ప్రయాణం తప్పనిసరి. ఈ మార్గంలో ప్రజల రాకపోకలు నిత్యం పెరుగుతుండడం, వంతెన పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న అప్రోచ్ స్లాబ్

క్రైం కార్నర్ వివాహిత అదృశ్యం


అదృశ్యమైన రాధ

పలాస, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తన పెద్ద కుమార్తె జంగం రాధ శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి కమల శనివారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. వివాహం తరువాత భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లలతో కలిసి పద్మనాభపురంలో ఉంటోంది. స్థానికంగా ఎఫ్‌సీ గోదాంలో హోం కీపర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పనికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. రాత్రి ఏడు గంటల వరకు వేచి చూశామని, ఎప్పటికీ రాకపోవడంతో బంధు వుల ఇళ్లలో వెతికామన్నారు. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నీలం-పింక్ రంగు చీర ధరించి ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పలాస, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మొగిలిపాడు గ్రామ సమీపంలో జాతీయరహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి.. మందస మండలం అంబుగాం గ్రామానికి చెందిన బళ్ల పాపారావు(36) టెక్కలి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా గుర్తు తెలియని లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. హెల్మెట్ ధరించినా దానిపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు, వాహనదారులు వెంటనే పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.సూర్య నారాయణ తెలిపారు.

సమయాన్ని వృథా చేయొద్దు


డ్యాన్సు చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని హెచ్‌ఎం ఓకులాదేవి అన్నారు. శనివారం సత్యవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు లక్ష్మణరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వినయంతో ఉన్నత విద్య

పోలాకి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో వినయ విధేయతలతో విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని దీర్ఘాశి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఆట, పాటలపై ఉన్న శ్రద్ధ చదవడంలో ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ మెండ సుమంగళి, విద్యాకమిటీ చైర్మన్ గేదెల శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై భారీ వాహనంతో ఇబ్బందులు


టెక్కలి హైవేపై వస్తున్న భారీ వాహనం

టెక్కలి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై ఆదీఆంధ్రావీధి సమీపంలో శనివారం ఓ భారీ వాహనం రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న ఈ వాహనం ఆదీ ఆంధ్రా వీధి సమీపంలో హైవేపై ఉన్న విద్యుత్ వైర్లను పొడుగు కర్రలతో పైకెత్తి వాహనం తరలించేందుకు విద్యుత్ సిబ్బంది, స్థానికులు చర్యలు తీసుకున్నారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మహిళా చైతన్యమే ప్రగతికి సోపానం

పాతపట్నం మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహిళా చైతన్యమే ప్రగతికి సోపానమని ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.అనూరాధ, హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొ న్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించండి

పాతపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలని పశు సంవర్ధకశాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. పాతపట్నం, సీది గ్రామాల్లో శనివారం టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలలున్న దూడలు మొదలుకొని అన్ని పశువులకు ఈ టీకాలు వేయించాలన్నారు.

పాడి రైతులు వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా అంద జేస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించాలని పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం నిమ్మాడ, చౌదరి కొత్తూరు, తిలారు, కొత్తపల్లి గ్రామాల్లో సామూహిక గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఏడీ డాక్టర్ ఎం.లోకనాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. తిలారు పశువైద్యాధికారి ఎం.ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రోత్సాహం

హరిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మందస వెలుగు కార్యాయలంలో శనివారం ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ బోర్డు డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన రైతుల కోసం ఏర్పాటు చేసిన వన్‌ధన్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, కొర్రలు, సజ్జలు, సామలు, ఊదలు వంటివాటిని ప్రకృతి వ్యవసాయంలో పండించి అధిక దిగుబడి సాధించాలని కోరారు. ఎఫ్‌పీవో సీసీ తారకమోహన్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట) మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన శనివారంమండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలను త దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. మండలంలో తాగు, సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీనిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, ఎంపీడీవో మురళీమోహన కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

రూ.వెయ్యి కోట్లు కేటాయింపు హర్షణీయం

● సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

కోటబొమ్మాళి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించడం హర్షణీయమని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు అన్నారు. ఈ మేరకు శనివారం సంఘ భవనంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సెలూన్‌కు ఉచితంగా 200 యూనిట్లు విద్యుత్ కోసం బడ్జెట్‌లో రూ.150కోట్లు, బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ.13.14 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.47.456 కోట్లు కేటాయించారన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు సీహెచ్ కనకరాజు, సూర్యనారాయణ, వీరాస్వామి, పోతల రామదాసు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ నేతలు

చెత్త సంపద కేంద్రాల వినియోగంపై దృష్టి సారించాలి

● డీపీవో భారతీసౌజన్య

హరిపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సందప తయారీ కేంద్రాల వినియోగంపై దృష్టి సారించాలని డీపీవో భారతీ సౌజన్య ఆదేశించారు. మందస పంచాయతీ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం కొంకడాపుట్టి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి సూచన లిచ్చారు. పంచాయతీలకు మంజూరయ్యే నిధులు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. అనేక గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయని, దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంద న్నారు. తక్షణం అధికారులంతా స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఇంకా నిర్మాణం పూర్తికాని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మందస ఈవోపీఆర్డీ జయ ప్రకాష్, ఈవో నవీన్ కుమార్ పాల్గొన్నారు.


చెత్త నుంచి సంపదకేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

చెత్త నుంచి ఎరువుల తయారీ

జలుమూరు (సారవకోట), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో గోపిబాల అన్నారు. గొర్రిబంద గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఎంపీడీవో మురళీ మోహన కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, కార్యదర్శి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఆదాయం రూ.6.60 లక్షలు

జలుమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి రూ.6.60 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ప్రత్యేక దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.2,00,260, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.1560, స్థలపురాణ పుస్తకాల విక్రయం వల్ల రూ.2320 వచ్చిందన్నారు. అలాగే స్వామివారి ఫొటోల ద్వారా రూ..530, పులిహోర ప్రసాదం విక్రయం ద్వారా రూ.1,03,440, వివిధ రూపేణ రూ.74,500, గుడ్డ హుండీ ద్వారా రూ..2,83,373 ఆదాయం వచ్చిందన్నారు.

ఘనంగా మహాసంప్రోక్షణం

శ్రీముఖలింగేశ్వరాలయంలో శనివారం ఉదయం అర్చకులు మహాసంప్రోక్షణం చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన తరువాత 4వ రోజు అర్చకులు ఆలయంలో సంప్రోక్షణం చేపట్టి శుద్ధి చేశారు. గణపతి పూజ, కలశారాధన అనంతరం ఏకవారాభిషేకం చేశారు. అష్టదిక్పాలకులకు జలాలతో సంప్రోక్షణం చేసి భక్తులకు స్వామి దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటాచలం, నారాయణ మూర్తి, ధనాలు, శివ, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టైం స్కేల్ అమలు చేయకపోవడం దారుణం

హిరమండలం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు టైం స్కేలు అమలు చేయకపోవడం దారుణ మని, దీంతో వారంతా అరకొర వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక కేజీబీవీలో సమా వేశం నిర్వ హించారు. ఏళ్ల తరబడి సమగ్రశిక్ష ఉద్యోగులు, కేజీబీవీ కాంట్రాక్టు ఉపాధ్యాయులు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. 2019 జూలై 29న అప్పటి ప్రభుత్వం ఎల్సిక్యూ 11028 పేరిట ఒక మెమో విడుదల చేసినప్పటికీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కూట మి ప్రభుత్వ స్పందించి ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ, ఎస్వో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్వీ రమణమూర్తి

కొత్త బడ్జెట్‌తో రాష్ట్రంలో అభివృద్ధి


మాట్లాడుతున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు

పలాస, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల జీవన స్థితిగతులను మారుస్తుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విజన్ 2047కు అవకాశం కలుగుతోందన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు గత ఏడాది ప్రస్తుత బడ్జెట్‌లో రూ.90 కోట్లు ప్రకటించి జిల్లాపై ప్రేమ కనబరిచారన్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు తలగాన శంకర్, ప్రసాద్, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం

కాశీబుగ్గ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ఈ బడ్జెట్ నిదర్శనమని మునిసి పల్ మాజీ చైర్మన్, జనసేన నాయకుడు కోత పూర్ణ చంద్రరావు అన్నారు. శనివారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని రంగాల వారికి ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. సూపర్ సిక్స్‌లో 'తల్లి వందనం' కూడా బడ్జెట్‌లో కేటాయించడంపై హర్షం వ్యక్తంచేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పలాస ఫ్లైఓవర్ పూర్తికి రూ. 46.64కోట్లు మంజూరుకు కృషి చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే శిరీషలకు అభినందిస్తున్నానని పేర్కొన్నారు.

71 వసంతాలు అభినందనీయం

పలాసరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఉద్యమాల పురిటిగెడ్డ బొడ్డపాడులో ఏర్పాటు చేసిన యువజన సంఘం 71 వసంతాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. శనివారం యువజన సంఘం వార్షికోత్సవం స్థానిక అమరవీరుల స్మారక మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలున్నంత వరకు పోరాటాలు జరుగుతూనే ఉంటాయన్నారు. బొడ్డపాడు గ్రామం నాటి నక్సల్బరీ శ్రీకాకుళ సాయుధ ఉద్యమానికి పుట్టినిల్లని, ఈ గ్రామంలో నాడు ఏర్పాటైన యువజన సంఘం నేటికీ కార్యక్రమాలను నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథం, వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, డీటీఎఫ్ జిల్లా గౌరవా ధ్యక్షుడు కోత ధర్మారావు, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, ఏబీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తామాడ త్రిలోచనరావు, టెక్కలి డివి జన్ రైతాంగ కమిటీ మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీరాములు, మామిడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం


బోరుభద్రలో ప్రారంభమైన పనులు

సంతబొమ్మాళి, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత కూడలి గ్రామమైన బోరుభద్రలో రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రోడ్డు పనులకు గాను ఉపాధి హామీ పథకంలో రూ.2.50 కోట్ల నిధులు మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో మంజూరైన విషయం తెలిసిందే. ఇసుకబంద చెరువు నుంచి శివాలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రోడ్డు విస్త రణ పనులను టెక్కలి పీఆర్ఐ డీఈ సుధాకర్ పరిశీలించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు అప్పిని వెంకటేష్, వజ్జ ప్రభాకర్, వల్లభ వసంతరావు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగాయి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందిగాం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కాంప్లెక్స్ ప్రాంతంలో వీధిలైట్లు ఎట్టకేలకు వెలిగాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'అంధకారంలో మండల కాంప్లెక్స్ ప్రాంతం' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. దీనికి ఎంపీడీవో టి.రాజా రావు స్పందించి తగు ఆదేశాలిచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కె.గోపీనాథ్ పర్యవేక్షణలో లైట్లు వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

బడ్జెట్‌లో కార్మికులకు ప్రాధాన్యం లేదు

మెళియాపుట్టి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు ప్రాధాన్యం లేకుండా చేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరయ్య తెలిపారు. శనివారం చాపరలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగుల పీఆర్సీ, ఐఆర్ ఊసే ఎత్తలేదన్నార కార్మికుల వేతన సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ప్రసాద్‌రావు, దామోదరరావు, నిరంజన్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ఉపాధ్యక్షుడు సూరయ్య

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్‌లో అదనపు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా హిరమండలం, సుభలయ, నౌగూడ ఆర్‌ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి సహక రించాలని కోరారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

నరసన్నపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల భవిష్యత్ నాశనమౌందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. లత అన్నారు. శనివారం కళాశాల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. మత్తు పదార్థాలను వినియోగించడం, విక్రయించడం నేరమన్నారు. ఈ అంశంలో విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జి.రవికుమార్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధికి కృషి

కాశీబుగ్గ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రజకులస్థుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొ రేషన్ డైరెక్టర్, జనసేన పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు అన్నారు. శనివారం నీలాపురం కాలనీలో రజక సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. రజకుల ఆధునిక దోబీ ఘాట్ల ఏర్పాటు, ఆదరణ పథకంలో పనిముట్ల సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కూర్మారావు, ఉపేంద్ర, నారాయణ, జోగారావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

6న చలో విజయవాడ

కొత్తూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి) ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామని, ఆశ వర్కర్లు పాల్గొనాలని ఆ సంఘ నాయకులు పి.జయలక్ష్మి, కె.జోత్స్న కోరారు. శనివారం ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.అప్పలమ్మ, క్రాంతికుమారి, లక్ష్మి, సుశీలమ్మ, రెయ్యమ్మ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

జలుమూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పొందే దిశలో కృషి చేయాలని వెలుగు కోఆర్డినేటర్ కొండలరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం సీఎఫ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్‌గా ఏ వస్తువులకు గిరాకీ ఉంటుందో వాటిని తయారుచేసి క్రయ విక్రయాలు చేపట్టడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. సమావేశంలో వెలుగు ప్రత్యేకాధికారి వైకుంఠరావు, ఏపీఎం హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో బ్రాహ్మణతర్లా

పలాసరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లా గ్రామంలోని పలు వీధుల్లో 15 రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పేరుకే పెద్ద పంచాయతీ అయినా వీధిలైట్లు వెలగక పోయినా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. రాత్రి చీకటిగా ఉండడంతో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తు న్నారు. కస్పావీధి, గడ్డవీధి, సీతమ్మతల్లి గుడివీధి, పెద్దవీధి, కడివీధి ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా సమస్యను పరిష్కరిస్తామన్నారు.